ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 14 మే 2025

నిందితులను కోర్టులోకి తీసుకెళుతున్న సాయుధ పోలీసులు



నిందితులు శబరిరాజన్, వసంత్, తిరునావుక్కరసు, సతీష్‌కుమార్, అరుళానందం, మణివన్నన్, అరుణ్‌కుమార్, హెరేన్‌పాల్, బాబు



పొల్లాచ్చి అత్యాచారాల కేసు...
కోవై మహిళా కోర్టు సంచలన తీర్పు

- 9 మంది ముద్దాయిలు మరణించే వరకు జీవితఖైదు
- బాధిత మహిళలకు తలా రూ.85 లక్షల నష్టపరిహారం

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చి సామూహిక అత్యాచారాల కేసులో కోయంబత్తూరు మహిళా న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో తొమ్మిది మందిని దోషులుగా ప్రకటించి, వారు మరణించేవరకు యావజ్జీవకారాగార శిక్ష విధిస్తున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు కలిగించిన ఈ సామూహిక అత్యాచార కేసులో ప్రముఖ రాజకీయ పార్టీ నేతల కుమారులు నిందితులు కావడంతో కేసును తప్పుదోవపట్టిస్తారని దర్యాప్తు బాధ్యతలను సీబీసీఐడీకి, ఆ తర్వాత సీబీఐకి అప్పగించారు. కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలో 2019లో రాజకీయ పలుకుబడి కలిగిన యువకులు కొందరు కాలేజీ విద్యార్థినులు, వివాహితలను ఫామ్ హౌస్‌లో నిర్బంధించి సామూహిక అత్యాచారాలకు పాల్పడి, వారిని నగ్నంగా వీడియోలు, ఫొటోలు తీసి చిత్రహింసలకు పాల్పడ్డారు. బాధిత మహిళలు బోరున విలపిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సైతం వెలువడిన విషయం తెలిసిందే. విద్యార్థినులు, వివాహితులు సహా మొత్తం ఎనిమిదిమంది పొల్లాచ్చి టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రాజకీయ నేతల కుమారులు నిందితులు కావడంతో కేసు దర్యాప్తును సీబీసీఐడీకి, ఆ తర్వాత హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం సీబీఐకి అప్పగించడంతో విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసులో తిరునావుక్కరసు (25), శబరిరాజన్ (25), వసంత్‌కుమార్ (27),



తీర్పు వివరాలను ప్రకటిస్తున్న సీబీఐ తరపు న్యాయవాది సురేంద్రమోహన్

సతీష్ (28), మణివన్నన్ (25) అనే ఐదుగురిని 2019లో అరెస్టు చేశారు. ఆ తర్వాత హేరన్‌పాల్ (29), బాబు అలియాస్ మైక్‌బాబు (34), అరుళానందం (34), అరుణ్‌కుమార్‌లను 2021లో అరెస్టు చేశారు. వీరందరిపై లైంగిక వేధింపులు, అత్యాచారం, అక్రమ నిర్బంధం, చిత్రహింసలు పెట్టడం, అశ్లీల వీడియోలు తీసి వ్యాపింప చేయటం, సాముహిక కుట్ర, సాక్ష్యాలను చెరపివేయటం సహా 13 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఆ తొమ్మిదిమందిని సేలం జైలులో బంధించారు. కోయంబత్తూరు మహిళా కోర్టులో ఈ కేసు విచారణ మొదట నత్తనడక సాగింది. సీబీఐ ఛార్జిషీటు కూడా దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశంతో విచారణ వేగం పుంజుకుంది. మహిళా కోర్టు మేజిస్ట్రేట్ నందినీదేవి సమక్షంలో విచారణ కొనసాగింది. ఈ కేసులో 50 మందికిపైగా సాక్షులను విచారించారు.. 200 దస్తావేజులను, 40 డిజిటల్ సాక్ష్యాలను (లాప్‌టాప్‌లు, హార్డ్ డిస్కులు, కెమెరాలు, సెల్‌ఫోన్‌లు) సీబీఐ సమర్పించింది. బాధితులు కూడా సాక్ష్యమిచ్చారు. ఇరువైపు వాదనలు ముగియటం, రాతపూర్వకమైన సాక్ష్యాల నమోదు కూడా పూర్తికావటంతో ఈ నెల 13న తీర్పు వెలువరించనున్నట్లు మేజిస్ట్రేట్ నందినీదేవి ప్రకటించారు. ఆ మేరకు మంగళవారం ఉదయం భారీ బందోబస్తు నడుమ సేలం సెంట్రల్ జైలు నుండి నిందితులను మహిళా కోర్టుకు తీసుకొచ్చారు. ఆ తర్వాత మహిళా న్యాయస్థానంలోకి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, నిందితులను, పోలీసు ఉన్నతాధికారులను మాత్రమే అనుమతించి తలుపులు మూసివేశారు. ఉదయం పది గంటలకు ఈ కేసులో నిందితులు తొమ్మిది మంది దోషులేనని మేజిస్ట్రేట్ ప్రకటించి శిక్షలకు సంబంధించిన వివరాలను మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రకటిస్తానన్నారు.

ఈ సందర్భంగా సీబీఐ తరపు న్యాయవాది సురేంద్రమోహన్ మీడియాతో మాట్లాడుతూ.. పొల్లాచ్చి సామూహిక అత్యాచారం కేసులో చక్కటి తీర్పు రానుందని, నిందితులు తొమ్మిదిమందిని ముద్దాయిలుగా ప్రకటించారని, అందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశాల ఉన్నాయని తెలిపారు. నిందితుల అనారోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని శిక్షను తగ్గించాలని వారి తరపు న్యాయవాదులు కోరారని, ఆ తొమ్మిదిమందికి చచ్చేంతదాకా యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని ప్రభుత్వ తరపున కోరామనని చెప్పారు. కోవై మహిళా కోర్టు ఇచ్చే తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అప్పీలు చేసుకున్నా శిక్ష తగ్గే అవకాశం ఉండదని కూడా ఆయన స్పష్టం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మళ్ళీ మహిళా కోర్టులో ముద్దాయిలను పోలీసులు హాజరుపరచటంతో మేజిస్ట్రేట్ నందినీదేవి తీర్పు వెలువరించారు. ఆ మేరకు సామూహిక అత్యాచారాల కేసులో ముద్దాయిలు చేసిన నేరాలను బట్టి వారికి శిక్షలను విధిస్తున్నామని మేజిస్ట్రేట్ పేర్కొంటూ తిరునావుక్కరసు, మణివన్నన్ అనే వారికి ఐదు యావజ్జీవ కారాగార శిక్షలు, శబరిరాజన్‌కు నాలుగు యావజ్జీవ కారాగార శిక్షలు, సతీష్ హెరేన్‌పాల్‌కు మూడు యావజ్జీవ శిక్షలు, వసంత్‌కుమార్‌కు రెండు యావజ్జీవ కారాగార శిక్షలు, బాబు, అరుళానందం, అరుణ్‌కుమార్‌కు తలా ఒక యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. అంతేకాకుండా బాధితులైన 8 మంది మహిళలకు తలా రూ.85లక్షల నష్టపరిహారంగా చెల్లించాలని ఉత్తర్వు జారీ చేశారు.

మహిళా సంఘాల హర్షం...
ఈ తీర్పు వెలువడగానే కోర్టు వెలుపల మహిళా సంఘాల సభ్యులు హర్షం ప్రకటించారు. ముద్దాయిలకు సరైన శిక్ష విధించారని, బాధితమహిళలకు న్యాయం జరిగిందంటూ నినాదాలు చేశారు.



కోర్టు బయట తీర్పును స్వాగతిస్తూ మహిళా సంఘాల ప్రదర్శన



పొల్లాచ్చిలో మిఠాయిలు పంచుతున్న డీఎంకే నేతలు

తీర్పుపై నేతల హర్షం..

పొల్లాచ్చి సామూహిక అత్యాచారం కేసులో చక్కటి తీర్పు వెలువడిందని, అన్నాడీఎంకే నేత సహా ముద్దాయిలకు సరైన శిక్షలు విధించారని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్‌పేజీలో ఆయన ఓ సందేశం వెలువరించారు. అన్నాడీఎంకే నాయకుడు సహా ముద్దాయిల శిబిరాన్ని కాపాడేందుకు ప్రయత్నించిన 'సార్'లు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఈ తీర్పును స్వాగతిస్తూ ప్రకటన జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడేవారికి ఈ తీర్పు తీవ్రమైన హెచ్చరిక వంటిదన్నారు. సామూహిక అత్యాచారం కేసులో వెలువడిన తీర్పు ఇలాంటి అత్యాచారాలు రాష్ట్రంలోనే కాకుండా దేశమంతటా జరుగకుండా అడ్డుకునే రీతిలో ఉందని, తీర్పును తమ పార్టీ స్వాగతిస్తుందని డీపీఐ నేత తిరుమావళవన్ అన్నారు. పొల్లాచ్చి అత్యాచారాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా చేస్తానంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన శపథం ఎట్టకేలకు నెరవేరిందని డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. అన్నాడీఎంకే విడుదల చేసిన ఓ ప్రకటనలో పొల్లాచ్చి సామూహిక అత్యాచార కేసులో చక్కటి తీర్పు రావడానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కారణమని, ఆయనే సీబీఐ విచారణకు ఆదేశించారనే విషయాన్ని ఎవరూ మరువకూడదన్నారు.

ఆ కూటమితో
మాకేం నష్టం లేదు

- సీఎం స్టాలిన్

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు యేడాది ముందే అవినీతి, అక్రమార్జన కేసులలో ఈడీ, ఐటీ దాడుల నుంచి తప్పుకునేందుకు, ఆదరాబాదరగా బీజేపీతో పొత్తుపెట్టుకున్న అన్నాడీఎంకే కూటమి వల్ల డీఎంకే కూటమికి లేశమాత్రం నష్టం వాటిల్లదని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ప్రముఖ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదంటూ తొమ్మిది నెలల పాటు పాల్గొనే ప్రతిసభలోనూ ప్రకటించిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఉన్నట్టుండి అప్పటివరకు తిట్ల వర్షం కురిపించిన బీజేపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకు తిరగటాన్ని రాష్ట్ర ప్రజలంతా ఏవగించుకుంటున్నారన్నారు. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లకు పైగా గెలుచుకుంటుందని చెప్పటానికి ప్రజలంతా ద్రావిడ తరహా పాలనకు గట్టి మద్దతు ఇస్తుండటమే కారణమన్నారు. మహిళాభ్యుదయానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శవంతంగా ఉంటున్నాయని, 'అందరికీ అన్ని సదుపాయాలు' అనే ఏకైక లక్ష్యంతోనే నాలుగేళ్లుగా తమ పాలన సమర్థవంతంగా కొనసాగిందని చెప్పారు. డీఎంకే కూటమి ప్రస్తుతం పటిష్ఠంగానే ఉందని, మరిన్ని పార్టీలు కూటమిలో చేరుతాయో లేదో వేచి చూడాలని అన్నారు.

ఓర్వలేకే ఈడీ దాడులు...

రాష్ట్రంలో నాలుగేళ్లుగా ద్రావిడ తరహా డీఎంకే పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం చూసి ఓర్వలేకనే తమ మంత్రులపై తప్పుడు అవినీతి ఆరోపణలు చేస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, ఐటీ వంటి సంస్థల ద్వారా అదే పనిగా దాడులు చేయిస్తోందని స్టాలిన్ విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలలో రోజురోజుకూ తమపై పెరుగుతున్న ఆదరాభిమానాల వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తామనే నమ్మకం తనకు ఉందన్నారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పడుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నాడీఎంకేతో పొత్తును ఖరారు చేసుకున్న సమయంలో ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. 2016 ఎన్నికలకు ముందు రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్‌షా భారతదేశంలోనే అత్యధికంగా అవినీతి అక్రమాలకు పాల్పడింది అన్నాడీఎంకే ప్రభుత్వమేనని ఆరోపించారని, ప్రస్తుతం ఆ పార్టీతోనే బీజేపీ పొత్తు పెట్టుకోవడాన్ని ప్రజలు హర్షించలేకపోతున్నారని చెప్పారు.

గవర్నర్ పదవి అనవసరం...

శాసనసభలో ఆమోదించిన పది బిల్లులకు ఆమోదం తెలుపకుండా మొండి వైఖరి అనుసరించడం వల్లే గవర్నర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుదాకా వెళ్ళి ఆ బిల్లులకు ఆమోదం లభించేలా అన్ని రాష్ట్రాలకు కూడా వర్తించేలా చక్కటి తీర్పును సంపాదించుకోగలిగినట్లు స్టాలిన్ చెప్పారు. గవర్నర్ పదవి ఉండకూడదనే దశాబ్దాల తరబడి తమ పార్టీ చెబుతోందని, అదే సమయంలో గవర్నర్ పదవికి ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలను ఇస్తూనే ఉంటామని చెప్పారు. గవర్నర్‌కు, తనకు వ్యక్తిగతమైన విరోధాలు లేవని ఆయన స్పష్టం చేశారు.



నీలగిరి జిల్లా ముదుమలై ఏనుగుల సంరక్షణ కేంద్రంలో ఓ ఏనుగుకు చెరకు తినిపిస్తున్న సీఎం స్టాలిన్, ఆయన సతీమణి దుర్గా స్టాలిన్

ప్రజల హక్కులను కాపాడతాం

- ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం ప్రజల చట్టపరమైన హక్కులను కాపాడుతుందని, ఇందుకు తామంతా కట్టుబడి పని చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. మంగళవారం తిరువొత్తియూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కదిరివాక్కంకు చెందిన 1,500 మందికి ఉపముఖ్యమంత్రి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజధాని నగరం చెన్నై, శివారు ప్రాంతాల ప్రజలకు పట్టాలు పొందడంలో పడుతున్న ఇబ్బందులు తొలగించి, పట్టాలు అందజేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారన్నారు. ఆ ప్రకారం, ఏడాది లోపు 1.38 లక్షల మందికి పట్టాలు పంపిణీ చేసిన ఘనత ద్రావిడ మోడల్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర చెన్నై థర్మల్ కేంద్రం కోసం భూములిచ్చిన 400 మందికి మరో ప్రాంతంలో స్థలం కేటాయిస్తూ పట్టాలు అందించామని తెలిపారు. తినడానికి ఆహారం-ధరించేందుకు దుస్తులు, బస చేసేందుకు స్థలం అనేవి ప్రాథమిక అవసరాలు మాత్రమే కాదని, ఆ స్థలాలకు సంబంధించి ప్రజల చట్టపరమైన హక్కులను డీఎంకే ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. అలాగే, ఈ ప్రాంతానికి చెందిన ప్రజల కోసం 18వేల పట్టాలు సిద్ధం చేస్తున్నామని, త్వరలో వాటిని అందజేయనున్నామని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి శేఖర్, చెన్నై మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి

'సీబీఎస్ఈ' ఫలితాలు
చెన్నై జోన్‌లో 98.48 శాతం ఉత్తీర్ణత

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ప్లస్-2, పదో తరగతి పరీక్షాల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ప్లస్-2 పరీక్షా ఫలితాల్లో చెన్నై జోన్‌లో 98.48 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల్లో దేశవ్యాప్తంగా ఉన్న 17 జోన్లలో చెన్నై జోన్ మూడో స్థానంలో నిలిచింది. 99.60 శాతం ఉత్తీర్ణతతో విజయవాడ జోన్ ప్రథమస్థానంలో నిలిచింది. ఇక పదో తరగతి ఫలితాల్లో 93.6 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రం నుండి 42,904 మంది బాలురు, 37,314 మంది బాలికలు ప్లస్-2 పరీక్షలకు హాజరయ్యారు. పదో తరగతి పరీక్షల్లో 98.71 శాతం ఉత్తీర్ణతతో జాతీయ స్థాయిలో చెన్నై జోన్ నాలుగో స్థానం దక్కించుకుంది. రాష్ట్రం నుండి 56,008 మంది బాలురు, 47,251 మంది బాలికలు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ రెండు పరీక్షల ఫలితాలు సీబీఎస్ఈ వెబ్‌సైట్ ద్వారా వెల్లడయ్యాయి.



అన్నానగర్ స్కూల్లో సీబీఎస్ఈ వెబ్‌సైట్ ద్వారా ఫలితాలను చూస్తున్న విద్యార్థులు

మంత్రి సామినాథన్‌కు అస్వస్థత

- అపోలో ఆస్పత్రిలో చికిత్స



టి.నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తమిళాభివృద్ధి, సమాచార శాఖల మంత్రి సామినాథన్ మంగళవారం వేకువజాము ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ని చికిత్స నిమిత్తం గ్రీమ్స్‌రోడ్డులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఆయన చికిత్స పొందుతున్నారు.

కారు ప్రమాదంలో తల్లీకొడుకుల మృతి

టి.నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): కుంభకోణం సమీపం అచ్చూరు వద్ద మంగళవారం వేకువజామున జరిగిన కారు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పట్టుకోట్టలో నివసిస్తున్న సతీష్‌కుమార్ (45), భార్య సత్య (40), వీరి కుమారుడు శ్రీరామ్ (17), కుమార్తె అభిశ్రీ (15) కారులో సోమవారం అర్ధరాత్రి తంజావూరులోని బంధువుల ఇంటికి బయలుదేరారు. మంగళవారం వేవకుజాము కుంభకోణం- తంజావూరు బైపాస్ రోడ్డులోని అచ్చూరు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. సత్య ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ సమాచారం అందుకున్న స్వామిమలై పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారు శిథిలాల మధ్య చిక్కుకున్న శ్రీరామ్, సతీష్‌కుమార్, అభిశ్రీని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శ్రీరామ్‌ను మెరుగైన వైద్యం కోసం కుంభకోణం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. ఆసుపత్రిలో సతీష్‌కుమార్, అభిశ్రీకి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

సమాచార ధ్వని

కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్‌లో 2025-26 వ సంవత్సరానికి పూర్తికాల డిప్లొమో ఇన్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ కోర్సులకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేయవచ్చు. దరఖాస్తులను www.tncu.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో బుధవారం నుంచి ఈ నెల 20వ తేదీలోపు సమర్పించాలి. ఈ కోర్సుకు వయోఃపరిమితి లేదు. దరఖాస్తులు నేరుగాను, పోస్టు ద్వారా పంపితే స్వీకరించరు. శిక్షణ రుసుము ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలి. వివరాలకు 044-25360 041, 9444470013 అనే నెంబర్లు సంప్రదించవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

'ఉత్తమ సామాజిక కార్యకర్త' పురస్కారం

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందజేసే ఉత్తమ సామాజిక కార్యకర్త, స్వచ్ఛంద సంస్థల అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.. భాష, జాతి, సంస్కృతి, కళలు, సైన్స్, సేవా తదితర సామాజిక కార్యక్రమాలు, మహిళల సంక్షేమం, అభివృద్ధికి కృషిచేస్తున్న సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాలు అందజేస్తోంది. 2025 పురస్కారాలకు సంబంధించి ఆసక్తి కలిగిన వారు తమ సేవా కార్యక్రమాలతో కూడిన వివరాలతో కూడిన దరఖాస్తులను జూన్ 12లోగా www.awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో సమర్పించాలి. పురస్కారగ్రహీతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేయనున్నారు.

23 నుంచి ఏర్కాడులో వేసవి ఉత్సవాలు

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) సేలం జిల్లా ఏర్కాడులో వేసవి ఉత్సవాలు ఈ నెల 23 నుంచి 29వ తేది వరకు జరుగనున్నాయి. ఉత్సవాలను వ్యవసాయ శాఖ మంత్రి ఎమ్మార్కే. పన్నీర్‌సెల్వం, అటవీ శాఖ మంత్రి ఎం.మదివేందన్, పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ ప్రారంభించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్కాడులో మాత్రమే వికసించే పూల రకాలు 25వేల కుండీల్లో ప్రదర్శించనున్నారు. అలాగే, కూరగాయలతో వివిధ రకాల జంతువులు, పక్షులు సహా పలు ఆకృతులు పర్యాటకులకు మరింత కనువిందు చేయనున్నాయి. అలాగే, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటుచేయనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

వైగై డ్యాం నుంచి నీటి విడుదల నిలిపివేత

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): వైగై డ్యాం నుంచి నీటి విడుదల నిలిపివేశారు. మదురై చిత్తిరై ఉత్సవాల్లో కళ్లగర్ వైగై నది ఆగమనం ప్రధానమైనది. ఈ వేడుకల నిర్వహణకు వైగై నదిలో నీరు లేకపోవడంతో, తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని వైగై డ్యాం నుంచి ఈ నెల 8వ తేది నీరు విడుదల చేశారు. చిత్తిరై ఉత్సవాల్లో కళ్లగర్ వైగై నది ఆగమనం సోమవారం ముగిసిన నేపథ్యంలో, వైగై డ్యాం నుంచి నీటి విడుదల నిలిపివేసినట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

బస్టాపుల్లో విద్యుద్దీపాలు

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో బస్టాండ్లు, రోడ్లు శుభ్రపరిచే పనులు చేపడుతున్నారు. పిల్లలు, ప్రయాణికుల భద్రత దృష్ట్యా కార్పొరేషన్ బస్టాపుల్లో విద్యుద్దీపాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. తొలివిడతగా రోడ్డు పక్కన విద్యుత్ సదుపాయం ఉన్న 675 బస్టాపుల్లో తలా రెండు విద్యుద్దీపాలు ఏర్పాట చేపట్టగా, 70 ప్రాంతాల్లో పనులు పూర్తిచేశారు. అలాగే విద్యుత్ సదుపాయం లేని 210 బస్టాపుల్లో విద్యుత్ మీటరుతో కూడిన విద్యుద్దీపాలు ఏర్పాటుచేస్తున్నట్లు జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

నేటినుంచి 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీలు

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ విడుదల చేసిన ప్రకటనలో... పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత సైన్యం చేసిన దాడులు ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురిచేశాయన్నారు. 'ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్నామన్నారు. ఆ ప్రకారం, బుధవారం రాజధాని నగరం చెన్నైలోను, ఇతర ముఖ్యమైన నగరాల్లో 15వ తేది, జిల్లా మున్సిపాలిటీల్లో 16,17 తేదీలు, శాసనసభ నియోజకవర్గాలు, తాలూకా కేంద్రాలు, పెద్ద గ్రామాల్లో 18వ తేది మువ్వెన్నల జెండాలతో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించనున్నట్లు నయినార్ నాగేంద్రన్ తెలిపారు.

నేటినుంచి 'కాలేజ్ డ్రీమ్' కార్యక్రమం

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ తర్వాత, ఏం చదవాలనే 'కాలేజ్ డ్రీమ్' కార్యక్రమంలో నగరంలో బుధవారం నుంచి ప్రారంభం కానుంది. అన్ని ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో 2022-23, 2023-24లో ప్లస్ టూ పాసైన, ఫెయిలైన, బడి మానేసిన, కళాశాలల్లో చేరని 5,666 మంది విద్యార్థులు ఏం చదవాలి అనే విషయమై సూచనలు, సలహాలివ్వనున్నారు. అడయార్, కోడంబాక్కం, తేనాంపేట ప్రాంతాలకు చెందిన వారిని బుధవారం కోట్టూపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో ఈ కార్యక్రమం జరుగనుంది. అలాగే, అడయార్, కోడంబాక్కం ప్రాంతాల్లో 16వ తేది శాంతోమ్ హైరోడ్డులోని సెయింట్ పీట్స్ సీనియర్ సెకండరీ పాఠశాలలో నిర్వహించనున్నారు. తిరువికనగర్, తండయార్‌పేట, తిరువొత్తియూర్ ప్రాంతాల్లో 19వ తేది తిరువొత్తియూర్ వెల్లయన్ చెట్టియార్ పాఠశాల, అన్నానగర్, రాయపురం, తేనాంపేట ప్రాంతాల్లో 20వ తేది శాంతోమ్ సెయింట్ పీట్స్ పాఠశాలల ప్రాంగణంలో 'నాన్ ముదల్వన్' పథక మార్గదర్శకాలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పోర్టు రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్, లిఫ్ట్ ఏర్పాటు చేయాలి


చెన్నై పోర్టు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు


ప్యారీస్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ ప్రాంతంలోని చెన్నైపోర్ట్ రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్, లిఫ్ట్ సదుపాయం కల్పించాలని ప్రయాణికులు దక్షిణ రైల్వేశాఖను కోరారు. చెన్నై బీచ్- చెంగల్పట్టు రైలు మార్గంలో ప్రతి రోజు 300 పైగా నడుపుతున్న విద్యుత్ సబర్బన్ రైళ్లలో సుమారు 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. బీచ్-చెంగల్పట్టు, బీచ్-వేళచ్చేరి ఈ రెండు మార్గాల్లో ఉన్న ప్రధాన రైల్వేస్టేషన్లలో పోర్ట్ రైల్వేస్టేషన్ ఒకటి. సచివాలయానికి వెళ్ళే ఉద్యోగులు, రిజర్వు బ్యాంక్ ఉద్యోగుల, పోర్ట్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఫ్లవర్‌బజార్, ఈవెనింగ్ బజార్లకు వెళ్ళే వ్యాపారులు, ప్రజలు ఈ రైల్వేస్టేషన్‌లో దిగివెళ్తుంటారు. అయితే, ఇక్కడున్న ప్లాట్‌ఫామ్‌లలో ఎస్కలేటర్, లిఫ్ట్ లేక ప్రయాణికులు మెట్లెక్కి వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎగ్మూర్ నుంచి బీచ్ రైల్వేస్టేషన్ వరకుఉన్న మూడు లైన్ల రైలు మార్గాన్ని నాలుగు లైన్లుగా విస్తరింపజేశారు. ఇన్నాళ్ళు మరమ్మతుల కారణంగా నిలిపివేసిన ఎమ్ఆర్‌పీఎస్ రైళ్ల సేవలు ప్రస్తుతం బీచ్-వేళచ్చేరి మధ్య అందుబాటులోకి వచ్చింది. పోర్టు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ కూడా పెరిగిన దృశ్యా ఇక్కడ కనీస వసతులు మెరుగు పరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'వందేభారత్' రైళ్లను మరిన్ని మార్గాల్లో నడపాలి

● పీఎంకే ఎంపీ అన్బుమణి డిమాండ్

ప్యారీస్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వందేభారత్ రైళ్లను మరిన్ని మార్గాల్లో నడపాలని పీఎంకే ఎంపీ అన్బుమణి రాందాస్ దక్షిణ రైల్వేశాఖను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంనుంచి దేశంలోని ఇతర రాష్ట్రాలకు అలాగే, రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల మధ్య నడపాల్సిన 20 వందేభారత్ రైళ్లకు సంబంధించిన బోగీల్లో తొమ్మిది రైళ్ల బోగీలు ఒడిశా, పశ్చిమ బెంగాళ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు కేటాయించినట్లు సమాచారం తెలిసి, దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. రాష్ట్రంలో వందేభారత్ రైళ్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఏర్పడిందని, రాజధాని నగరం చెన్నై నుంచి బెంగళూరు, తూత్తుకుడి, తాంబరం నుంచి రామేశ్వరం వరకు గల రైలు మార్గాల్లో వందేభారత్ రైళ్ల సేవలను ప్రారంభించాలని అన్బుమణి తన ప్రకటనలో కోరారు.

సిద్ధుడి విగ్రహం లభ్యం



వేలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం భువనేశ్వరిపేటలో ఉన్న బాల వినాయకుడి ఆలయం వీధిలో కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాలువ నిర్మించేందుకు తీసిన గుంతలో రెండడుగుల సిద్ధుడి రాతి విగ్రహం బయల్పడింది. సమాచారం అందుకున్న రెవెన్యూ శాఖ అధికారులు విగ్రహం స్వాధీనం చేసుకున్నారు.

పాఠశాలల బస్సుల తనిఖీ


ప్రైవేటు పాఠశాలల బస్సులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సన్‌బీమ్ పాఠశాల మైదానంలో ప్రైవేటు పాఠశాలల బస్సుల తనిఖీ జరుగుతున్నాయి. జిల్లాలో 638 ప్రైవేటు పాఠశాలల బస్సులున్నాయి. ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో బస్సుల నాణ్యత, పనితీరులపై రవాణా శాఖ అధికారులు తనిఖీ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ప్రైవేటు పాఠశాలల బస్సులు తనిఖీ చేసిన కలెక్టర్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ... జిల్లాలోని 137 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 638 బస్సులు తనిఖీ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా రవాణా శాఖ అధికారి సుందరరాజన్ సహా పలువురు అధికారులున్నారు.

తిరుచెందూర్‌లో వెనక్కివెళ్లిన సముద్రం


సముద్రం వెనక్కి వెళ్లిన దృశ్యం

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్‌లో సోమవారం కూడా సముద్రం 60 అడుగుల వెనక్కు వెళ్లింది. సాధారణంగా పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఒకటి, రెండు రోజులు ముందుగా, తర్వాత సముద్రం వెనక్కి వెళ్లడం జరుగుతోంది. ఆదివారం సముద్రం 50 అడుగుల వెనక్కి వెళ్లి అనంతరం యథాస్థితికి చేరుకుంది. అలాగే, సోమవారం ఉదయం కూడా సముద్రం 60 అడుగుల వెనక్కి వెళ్లింది. సముద్రం వెనక్కి వెళ్లడంతో పాచిపట్టిన రాళ్లు, సముద్రపు జీవులు బయటపడ్డాయి. అయ్యా వైకుంఠ అవతారం ప్రాంతం, తిరుచెందూర్ ఆలయ సముద్రతీరం వరకు ఉన్న ప్రాంతంలో ఈ దృశ్యం కనిపించింది. అయినా, చిత్రా పౌర్ణమి సందర్భంగా ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే, సముద్రం వెనక్కి వెళ్లడంతో బయటపడిన బండరాళ్లపై భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు.

చెట్టును ఢీకొన్న బస్సు

● 20 మందికి గాయాలు


చెట్టును ఢీకొని ధ్వంసమైన బస్సు

టి.నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు సమీపంలో అదుపుతప్పిన ప్రైవేటు బస్సు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో 20 మంది గాయపడ్డారు. వేలూరు నుండి ఒట్టకత్తూరుకు వెళుతున్న ప్రైవేటు బస్సు మంగళవారం వేకువజాము ఆనైకట్టు సమీపం మూలైగేట్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చింతచెట్టును ఢీకొంది. ఈ దుర్ఘటనలో బస్సులో ఉన్న 20 మంది గాయాపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా, వీరిలో 33 యేళ్ల మహిళ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనైకట్టు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై రెండు రోజుల శిక్షణ

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి: తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్‌పై ఈ నెల 28,29 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. డిజిటల్ మార్కెటింగ్ ప్రాథమిక అంశాలు, విజయానికి వ్యూహాలు సహా పలు అంశాలపై నిపుణులు వివరించనున్నారు. చిరు వ్యాపారులు, వ్యాపారాలు ప్రారంభించే వారు ఈ శిక్షణ పాల్గొనవచ్చు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో ఈ శిక్షణ జరుగనుంది. మరిన్ని వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 9360221280, 9543773337 అనే నెంబర్లు సంప్రదించవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

సినిమాటిక్ డ్రోన్ శిక్షణ... : సినిమాటిక్ డ్రోన్ శిక్షణ ఈ నెల 27 నుంచి 30వ తేది వరకు జరుగనుంది. సినిమాటిక్ డ్రోన్ టెక్నిక్, ఏరియల్ స్టోరీ టెల్లింగ్, డ్రోన్ రిమోట్ కంట్రోల్, సినిమాటిక్ స్టంట్స్ సీక్వెన్స్‌లకు డ్రోన్ షాట్, సినిమాటిక్ పాటల సీక్వెన్స్‌లకు డ్రోన్ షాట్‌లు, కలర్ గ్రేడింగ్, ఎడిటింగ్ టెక్నిక్‌లు, డీజీసీఏ చట్టం తదితరాలపై నిపుణులు వివరించనున్నారు. ఈకాట్టుతాంగళ్‌లోని తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో జరుగనున్న ఈ శిక్షణలో 10వ తరగతి ఉత్తీర్ణులైన 18 ఏళ్లకు పైబడిన యువతీ, యువకులు పాల్గొనవచ్చు. శిక్షణలో చేరే వారికి తక్కువ అద్దెకు బస వసతి కల్పించనున్నారు.మరిన్ని వివరాలకు www.editn.inఅనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

తిరుత్తణిలో ఇళ్ల పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు

తిరుత్తణి, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తూ మంగళవారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతుందని, ఇందులో భాగంగానే పేదప్రజల అభ్యున్నతి కోసం వారి సొంతింటి కలను నిజం చేస్తూ తిరుత్తణిలోని మద్దూరు, కొత్తూరు ప్రాంతాల్లోని ప్రజలకు ఇంటి పట్టాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మలర్‌విళి, ఎస్ఐ గణేష్‌కుమార్, డీఎంకే నేతలు కృష్ణన్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

'కలైంజర్' పథకానికి 4 వరకు దరఖాస్తుల స్వీకరణ

● రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన

ప్యారీస్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గృహిణులకు కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కింద ప్రతినెలా ఇచ్చే రూ.1000ల పథకం విస్తరణలో భాగంగా ఆ పథకం ద్వారా లబ్ధిపొందని గృహిణుల నుంచి జూన్ 4 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో 2023 సెప్టెంబర్ 15 నుంచి గృహిణులకు నెల రూ.1000 పంపిణీ పథకం అమలుచేస్తున్నారు. ఈ పథకంలో ప్రస్తుతం కోటి 14 లక్షల మంది గృహిణుల బ్యాంకు ఖాతాలకు ప్రతినెల రూ.1000 చొప్పున ప్రభుత్వం జమచేస్తోంది. ఈ పథకంలో అర్హత కలిగిన కొంత మంది గృహిణులు ఇప్పటివరకు చేరకపోవడంతో మళ్ళీ ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో వచ్చే జూన్ 4వ తేదీ నుంచి 'మక్కలుడన్ ముదల్వర్' అనే కార్యక్రమానికి సంబంధించి దరఖాస్తులను మహిళల నుంచి సంబంధిత అధికారులు స్వీకరిస్తారు. మొత్తం 9వేల ప్రాంతాల్లో నిర్వహించనున్న ప్రత్యేక శిబిరాల్లో పాల్గొననున్న రెవెన్యూ శాఖ అధికారులు, తహసీల్దార్లు మంగళవారం సచివాలయంలో జరిగిన శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.

పుష్ప ప్రదర్శనకు ఊటీ ముస్తాబు

ఉత్సాహంగా పడవల పోటీ ● రేపు నీలగిరి జిల్లాకు సెలవు


పడవల పోటీలో పాల్గొన్న పర్యాటకులు

ప్యారీస్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్వతశ్రేణులపై పచ్చదనం, చల్లటి వాతావరణ సంతరించుకున్న వేసవి విడిది ప్రాంతమైన ఊటీ పుష్పప్రదర్శనకు ముస్తాబయ్యింది. గురువారం బొటానికల్ గార్డెన్‌లో 127వ పుష్ప ప్రదర్శనను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఆ రోజు నీలగిరి జిల్లాలోట కలెక్టర్ లక్ష్మీభవ్య స్థానిక సెలవు ప్రకటించారు. దీనికి బదులు ఈ నెల 31వ తేదీ ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తాయని ఆమె తెలిపారు. ఇదిలా వుండగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యానవన శాఖ నిర్వహణలోని బొటానికల్ గార్డెన్‌లో వివిధ రకాలకు చెందిన 5 లక్షల పూలమొక్కలను పెంచారు. ఇన్కా మేరీగోల్డ్, ఫ్లగ్స్, బెటూనియా, ఫాన్సీ, డయాంతస్, బికోనియా, డేలియా, పాల్సం, రెనస్ ఫ్లస్, వయోలా, అజరేటం, కాలండులా, గ్లాడియోలస్, విలియం, సన్‌ఫ్లవర్ వంటి అరుదైన పుష్పాలు సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదర్శనలో ఉంచనున్నారు. ఇదిలా వుండగా వేసవి సీజన్‌ను పురస్కరించుకుని ఊటీ సరస్సులో పర్యాటకుల్లో ఉత్సాహం నింపేలా సోమవారం ప్రభుత్వ పర్యాటకశాఖ పడవల పోటీ నిర్వహించింది. ఇందులో పాల్గొని తొలి మూడు స్థానాలకు చేరుకున్న పర్యాటకులకు బహుమతులు అందజేశారు.

సిద్ధ కళాశాల ఆధ్వర్యంలో పూల జలాల సేకరణ


పూల జలాల సేకరణకు వచ్చిన సిద్ధ వైద్య విద్యార్థులు

చెన్నై, మే 13 (ఆంధ్ర జ్యోతి): చిత్రా పౌర్ణమి సందర్భంగా పూల నుంచి జలాలు తీసే కార్యక్రమంలో సిద్ధ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ సిద్ధ వైద్య విభాగానికి చెందిన వైద్యుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంది. ప్రొఫెసర్ డా.జి.సెంథిల్‌వేల్, ప్రొఫెసర్ ఎస్.శివకుమార్ నేతృత్వంలో 26 మంది పీజీ, 40 మంది యూజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 11న అర్ధరాత్రి 12 గంటలకు ఉత్తరమేరూర్ సమీపంలోని సిద్ధమల్లి ప్రాంతానికి చేరుకున్న బృందం, వేకువజామున 3.30 నుంచి ఉదయం 6.30 గంటల వరకు పూల నుంచి జలాలు సేకరించారు. సిద్ధ వైద్యంలో ఈ జలాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ప్రొఫెసర్ సెంథిల్‌వేల్ తెలిపారు.

బాలికను రక్షించబోయి... ఇద్దరి మృతి

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): బాలికను రక్షించేందుకు కాలువలో దూకిన మహిళ సహా ఇద్దరు మృతిచెందిన ఘటన కోయంబత్తూర్‌లో చోటుచేసుకుంది. పొల్లాచ్చి సమీపం మన్నూర్ ప్రాంతానికి చెందిన వివేకానందన్,కౌసల్య దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఈరోడ్‌లో ఉంటున్న వివేకానందన్ సోదరుడు కార్తీక్‌కుమార్-కనిమొళి దంపతులు (34) వేసవి సెలవులు కావడంతో తన ఇద్దరు కుమార్తెలతో మన్నూర్ వచ్చారు. సోమవారం వివేకానంద కుటుంబసభ్యులతో కలసి తిరుమూర్తి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుని, తిరుగు ప్రయాణంలో పీఏబీ కాలువలో స్నానాలకు దిగారు. వారిలో ఓ బాలిక కాలువలో కొట్టుకుపోవడాన్ని గమనించిన కార్తీక్ కుమార్, కౌసల్య, కనిమొళి ఆమెకు కాపాడేందుకు కాలువలో దూకారు. ఈ లోగా బాలికను స్థానికులు రక్షించగా, కార్తీక్‌కుమార్, కౌసల్య నీట మునిగి మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కుటుంబ కలహాలతో అధికారి భార్య ఆత్మహత్య

టి.నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేటలో సచివాలయ అధికారి భార్య కుటుంబ తగాదాల కారణంగా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సైదాపేట తాండర్‌నగర్‌లో నివసిస్తు బాలు సచివాలయంలో ఆర్థిక శాఖ ఉప కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయనకు నళిని (42) అనే భార్య, ఇద్దరు పిల్లలున్నారు. నళిని ఇంటిపట్టునే ఉంటూ టైలరింగ్ పనులు చేస్తోంది. బాలు, నళిని తరచూ కుటుంబ విషయంగా గొడవ పడుతుండేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరూ తీవ్రస్థాయిలో గొడవపడ్డారు. దీంతో నళిని కోపంగా భర్తను బాత్‌రూంలోకి నెట్టి తలుపు గడియపెట్టింది. ఆ తర్వాత తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్నానపు గదిలో బాలు వేసిన కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చి స్నానపు గది తలుపులు తెరిచారు. ఆ తర్వాత బెడ్‌రూంలో చూడగా నళిని ఉరివేసుకోవటం గమనించి దిగ్భ్రాంతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న సైదాపేట పోలీసులు నళిని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

బ్యూటీపార్లర్‌లో వ్యభిచారం

● ఇద్దరు మహిళల అరెస్ట్

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూర్‌లోని ఓ బ్యూటీ పార్లర్‌లో వ్యభిచారం జరుగుతున్న వ్యవహారంలో ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలోని వ్యభిచార నిరోధక విభాగం-1కు అందిన సమాచారంతో కొళత్తూర్ మల్లిగై అవెన్యూ మెయిన్ రోడ్డు సమీపంలోని ఓ వాణిజ్య కాంప్లెక్స్‌లో ఉన్న బ్యూటీ పార్లర్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, అక్కడ వ్యభిచారం జరున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఇద్దరి మహిళలను అరెస్ట్ చేసిన పోలీసులు, వ్యభిచారం కోసం తీసుకొచ్చిన ఇద్దరు యువతులను రక్షించి ప్రభుత్వం హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆస్పత్రిలో మహిళ తాళి చోరీ

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మెడలోని తాళిని చోరీ చేసిన వ్యవహారంలో ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక చెట్‌పెట్ మంగళాపురానికి చెందిన సుగంధి, తన తల్లి షీలా అనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 9న ఓమందూర్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. 10వ తేది రాత్రి భోజనం తీసుకొచ్చేందుకు బయటకు వెళ్లిన సుగంధి, తిరిగి వార్డులోకి వచ్చిన సమయంలో తల్లి మెడలోని 5 గ్రాముల మంగళసూత్రం కనిపించకపోవడంతో ట్రిప్లికేన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో... చూలైమేడు పారి వీధికి చెందిన అన్నభాగ్యం వార్డులోని మరో రోగికి సపర్యలు చేస్తుందని, ఆమె షీలా మెడలోని మంగళసూత్రం చోరీ చేసినట్లు తెలిసింది. దీంతో, అన్నభాగ్యంను అరెస్ట్ చేసిన పోలీసులు, ఆమె నుంచి మంగళసూత్రం స్వాధీనం చేసుకున్నారు.

ఖైదీలిచ్చే నగదు బంధువు ఖాతాకు...!

● జైలు వార్డెన్ సస్పెన్షన్

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు అందజేసే నగదును జైలు ఖాతాకు పంపకుండా, జీపే ద్వారా తన మామ ఖాతాకు పంపించిన జైలు వార్డెన్‌పై సస్పెన్షన్ వేటుపడింది. సేలం కేంద్ర కారాగారంలో సుమారు 1,250 మంది ఖైదీలున్నారు. ఖైదీలు తయారుచేసే ఆహార పదార్థాలు జైలు బజార్ ద్వారా ఖైదీలు, ప్రజలకు విక్రయిస్తుంటారు. ఈ వస్తువులు ఖైదీలు కొనుగోలు చేస్తుంటారు. ఖైదీల నుంచి నగదు తీసుకునే విభాగంలో సుబ్రమణియం అనే జైలు వార్డెన్ పనిచేస్తున్నారు. ఖైదీల నుంచి తీసుకునే నగదు జైలు ఖాతాకు జమకావడం లేదని జైలు అధికారులు తెలిసింది. ఈ వ్యవహారంపై అధికారులు చేపట్టిన విచారణలో, ఖైదీలు ఇచ్చే నగదు జీపే ద్వారా సుబ్రమణియం తన మామకు పంపాడని, ఆ ప్రకారం, ఇప్పటివరకు సుమారు రూ.1.80 లక్షలు పంపినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై జైళ్ల శాఖ ఏడీజీపీ విచారణకు ఆదేశించి సుబ్రమణియంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

లంచం కేసులో విద్యుత్ అధికారికి నాలుగేళ్ల జైలుశిక్ష

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకున్న విద్యుత్ బోర్డు అధికారికి న్యాయస్థానం నాలుగేళ్ల జైలుశిక్ష విధించింది. తిరునల్వేలి జిల్లా మహారాజ్‌నగర్ శివందిపట్టి రోడ్డుకు చెందిన శివభారతి, వల్లనాడు ప్రాంతంలో ప్రారంభించనున్న లాండ్రీ దుకాణానికి విద్యుత్ కనెక్షన్ కోరుతూ 2010 ఏప్రిల్ 30న విద్యుత్ బోర్డు జూనియర్ ఇంజనీర్ తిరుపతికి దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ కనెక్షన్ కోసం రూ.35వేలు లంచంగా ఇవ్వాలని తిరుపతి డిమాండ్ చేశాడు. ఈ విషయమై శివభారతి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారుల సూచనలతో శివభారతి రసాయనం పూసిన కరెన్సీ నోట్లు తిరుపతికి అందజేస్తుండగా అక్కడే మాటువేసిన అధికారులు అతడిని పట్టుకున్నారు. ఆ సమయంలో తన చేతిలోని రూ.500 నోట్లను తిరుపతి మింగేసేందుకు యత్నించాడు. అంతలో అధికారులు తిరుపతి నోట్లో వేసిన నోట్లు తీసేందుకు యత్నించిన సమయంలో నోటికి గాయం ఏర్పడింది. దీంతో ఆ కరెన్సీ నోట్లకు రక్తపు మరకలు అంటుకున్నాయి. అనంతరం తిరుపతిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు తూత్తుకుడి సెంట్రల్ క్రైమ్ కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో జూనియర్ ఇంజనీర్ తిరుపతికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వషీద్‌కుమార్ తీర్పు వెలువరించారు.

పుళల్ జైల్లో గంజాయి చాక్లెట్లు, మత్తు మాత్రల స్వాధీనం

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో మాదకద్రవ్యాలు, గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ జైల్లో విచారణ, శిక్ష పొందిన ఖైదీలు 3,500 మంది ఉన్నారు. ఖైదీలను పరామర్శించేందుకు వచ్చే బంధువులు, కుటుంబ సభ్యులు వారికి గంజాయి సహా పలురకాల మాదకద్రవ్యాలు అందిస్తున్నట్లు తెలిసింది. దీంతో, జైలు అధికారులు జైలు ప్రాంగణం, ఖైదీల గదుల్లో ఆకస్మికతనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో, సోమవారం జైలు ప్రాంగణంలో గస్తీ చేపట్టిన పోలీసులు, పొదల చాటున ఉన్న రెండు పొట్లాలను గమనించారు. వాటిని పరిశీలించగా, 50 మత్తు మాత్రలు, 135 గ్రాముల గంజాయి, 3 లైటర్లు, 30 సిగరెట్ ప్యాకెట్లు, 11 బీడి కట్టలు, సిమ్ కార్డుతో కూడిన సెల్‌ఫోన్, ఆరు గంజాయి చాక్లెట్లు గుర్తించారు. జైలు అధికారుల ఫిర్యాదుపై పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి, జైలు ప్రాంగణంలోని సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

వెల్లయంగిరిపై బాలుడి మృతి

● దర్శనానంతరం కిందకు దిగుతుండగా ప్రమాదం


వెల్లయంగిరి కొండపైకి వెళ్తున్న భక్తులు

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): కోవై వెల్లయంగిరి కొండ దిగుతున్న బాలుడు స్పృహ తప్పి పడి మృతిచెందిన ఘటన విషాదం నింపింది. పోలీసుల కథనం మేరకు... కోయంబత్తూర్ జిల్లా పూండి పశ్చిమ కనుమల్లోని వెల్లయంగిరి ఆండవర్ ఆలయం ఉంది. ఏడు కొండలు ఎక్కి వెళ్లి భక్తులు స్వామి దర్శనం చేసుకుంటారు. ఆండవర్ దర్శనానికి ఏడు కొండలు ఎక్కాల్సి ఉండడంతో, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారు రావద్దని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, తన తండ్రితో కలసి ఆండవర్ ఆలయానికి వెళ్లిన విశ్వ (15) స్వామి దర్శనం చేసుకుని కిందకు దిగుతున్న సమయంలో మూడో కొండ వద్ద హఠాత్తుగా స్పృహతప్పి పడి మృతిచెందాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

ఏదైనా ఉంటే నా ముఖంపైనే చెప్పండి

● కెనిషా ఫ్రాన్సిస్



'నాతో ఏదైనా చెప్పాలనుకుంటే నేరుగా నా ముఖంపైనే చెప్పండి' అంటూ బెంగళూరుకు చెందిన గాయని కెనిషా ఫ్రాన్సిస్ అంటున్నారు. ఓ నిర్మాత కుమార్తె వివాహానికి కోలీవుడ్ హీరో రవి మోహన్‌తో కలిసి కెనిషా రావడం ఇపుడు కోలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. రవి

చిత్రజ్యోతి

మోహన్ తన భార్యకు విడాకులు ఇచ్చేందుకు ప్రధాన కారణం కెనిషానే అంటూ కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. ఈ పుకార్లను నిజం చేస్తూ రవి మోహన్ - కెనిషా ఒకే ఫ్రేమ్‌లో కనిపించారు. దీంతో కెనిషాను టార్గెట్ చేస్తూ అనేక మంది విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో కెనిషా తాజాగా పరోక్షంగా స్పందించారు. రవి మోహన్ సతీమణి ఆర్తికి సపోర్ట్ చేస్తూ తనపై విమర్శలు చేస్తున్న వారినుద్దేశించి కూడా ఆమె మాట్లాడారు. ఎవరి పని వాళ్ళు చూసుకుంటే మంచిదన్నట్టు వ్యాఖ్యానించారు. 'నాతో ఏదైనా చెప్పాలనుకుంటే నన్నే సంప్రదించడం. నేరుగా నా ముఖంపై చెప్పండి. మీరు ఏం అనుకుంటున్నారో నాకూ తెలుస్తుంది కదా.. సొంత విషయాలు పట్టించుకోవడం మానేసి ఎవరైతే కేకలు వేస్తున్నారో అలాంటి వారంతా నా ముందుకు రండి. ఇతరుల దృష్టిని ఆకర్షించాలని, పబ్లిసిటీ పొందాలని మీరు కోరుకుంటున్నారని అనిపిస్తుంది. మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీరందరూ మద్దతుగా నిలుస్తున్నందుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

16న వెండి తెరపై తలపడనున్న
ముగ్గురు హాస్య నటులు

కోలీవుడ్‌కు చెందిన ముగ్గురు హాస్యనటులు ఈ నెల 16న వెండితెరపై తలపడనున్నారు. సంతానం నటించిన 'డీడీ నెక్స్‌లెవల్', సూరి నటించిన 'మామన్', యోగిబాబు నటించిన 'జోరా కై తట్టుంగ' మూవీలు ఉన్నాయి. వీటిలో సంతానం నటించిన డీడీ నెక్స్‌లెవెల్ కామెడీ హర్రర్ జానర్ కాగా, సూరి చిత్రం ఫ్యామిలీ సెంటిమెంట్‌తో కూడిన హాస్య చిత్రం. ఇక యోగిబాబు చిత్రం క్రైమ్ థ్రిల్లర్. గత కొంతకాలంగా హీరోగా నటిస్తున్న నటుడు సంతానం.. ఇపుడు మళ్ళీ కామెడీ పాత్రల్లో నటించేందుకు ఆసక్తి చూపుతున్నారు. యోగిబాబు హీరోగా, హాస్య నటుడిగా వెండితెరపై రాణిస్తున్నారు. సూరి హీరో పాత్రలకే పరిమితమవుతున్నారు. ఈ ముగ్గురు నటించిన మూడు చిత్రాలు ఒకే రోజున విడుదలకానుండటం ప్రేక్షకుల్లో ఆసక్తికరంగా మారింది.

'జోరా కై తట్టుంగ'లో యోగిబాబు



జీఎస్టీ ఎఫెక్ట్ ... ఇంగ్లీష్ టైటిల్స్‌పై మొగ్గు



'డ్యూడ్'లో ఓ దృశ్యం

దేశంలో జీఎస్టీ విధానం అమల్లోకి రాకముందు తమిళ చిత్ర పరిశ్రమలో నిర్మితమయ్యే చిత్రాలకు తమిళంలో పేర్లు పెడితే అలాంటి చిత్రాలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇచ్చేంది. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ రాయితీ రద్దు చేసింది. దీంతో కోలీవుడ్ దర్శకనిర్మాతలు, హీరోలు తమ చిత్రాలకు ఆంగ్లంలో టైటిల్స్ పెడుతున్నారు. ఈ యేడాది ఇప్పటి వరకు వచ్చిన వాటిల్లో సగానికిపైగా సినిమాలకు ఆంగ్లంలోనే టైటిల్స్ ఉన్నాయి. ఈ క్రమంలో ఈ నెలలో విడుదలకానున్న చిత్రాల్లో పలు చిత్రాలకు ఆంగ్లంలోనే టైటిల్స్ ఉన్నాయి. వాటిలో 'డెవిల్స్ డబుల్ నెక్స్ లెవల్', 'ఏస్', 'లెమన్', 'మద్రాస్ మ్యాట్నీ', 'స్కూల్', 'జిన్ ది బెట్', 'ది వెర్డిక్ట్', 'థగ్‌లైఫ్', 'చెన్నై సిటీ గ్యాంగ్‌స్టర్స్', 'డీఎన్ఏ', 'ఫీనిక్స్', 'ఫ్రీడమ్', 'కూలీ', 'మదరాసి', 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'బైసన్', 'డ్యూడ్' అంటూ ఇంగ్లీషులో టైటిల్స్ ఉన్నాయి. కేవలం సినిమా పేర్లు మాత్రమే ఆంగ్లంలో పెడుతున్నారనుకుంటే అది పొరపాటే. సినిమాలో వచ్చే ప్రకటనలు, సంభాషణలు, టీజర్స్ కూడా ఆంగ్లంలోనే ఉంటున్నాయి. ఇదేపరిస్థితి కొనసాగితే తమిళ భాష కనుమరుగైపోతుందంటూ తమిళ భాషాభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య దుకాణాల తమిళంలో పేర్లు పెట్టాలంటూ గగ్గోలు పెడుతున్న తమిళ భాషాభిమానులు.. కోలీవుడ్‌లో నిర్మితమయ్యే చిత్రాలకు మాతృభాషను విస్మరించి ఆంగ్లంలోనే పేర్లు పెడుతున్నప్పటికీ మిన్నకుండిపోతున్నారు.

ఆ కాంబో ఎందుకు కార్యరూపం దాల్చలేదు?

● లోకేష్ కనకరాజ్

అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్ కాంబో వర్కౌట్ కావాల్సి ఉండగా, అది తృటిలో చేజారిపోయింది. 'విక్రమ్' సినిమాకు ముందు రజనీకాంత్, కమల్ హాసన్‌తో లోకేష్ కనకరాజ్ ఓ చిత్రానికి ప్లాన్ చేశారు. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. ఇలా ఎందుకు జరిగిందో తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో లోకేష్ వివరించారు. 'రజనీ, కమల్‌ల కాంబినేషన్‌లో ఓ ప్రాజెక్టు చేపట్టేందుకు ఎంతో కృషి చేశాను. వీరిద్దరు కలిసి నటించే చిత్రంపై సంతకాలు చేసేంత వరకు వెళ్ళింది. కానీ, కొవిడ్ కారణంగా అది సాధ్యంకాలేదు. ఈ కాంబో ప్రాజెక్టుకు సంబంధించి నేను కథ చెప్పగానే రజనీ, కమల్ ఇద్దరూ నా ముందే ఫోనులో మాట్లాడుకున్నారు. ఈ మూవీని కమల్ హాసన్ నిర్మించేలా, నేను దర్శకత్వం వహించేలా ప్లాన్ చేశాం. వీరికి చెప్పిన కథ ఇప్పటికీ నా దగ్గరుంది. అది ఇద్దరు గ్యాంగ్‌స్టర్ల మధ్య సాగే స్టోరీ. సినిమా బిజినెస్ పూర్తిగా మారిపోయింది. అప్పటికీ, ఇప్పటికీ ఎంతో తేడా ఉంది. ఇపుడు వీరిద్దరూ కలిసి నటిస్తే వ్యాపారం భారీ స్థాయిలో ఉంటుంది. దానిని దృష్టిలో ఉంచుకుని ఇద్దరు అగ్రహీరోల కాంబోలో సినిమా తీయాలని భావించాను. కానీ, కరోనా కారణంగా అది కార్యరూపం దాల్చలేదు' అని వివరించారు.



కమల్, రజనీకాంత్, లోకేష్ కనకరాజ్

వేడుకగా 'సూపర్ మామ్' పోటీలు



అతిథులతో విజేతలు

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమింజిగరైలోని అంపా స్కైఒన్ మాల్‌లో జరిగిన 'సూపర్ మామ్-2025' పోటీలు ఉత్సాహభరితమైన మాతృత్వానికి మరపురాని వేడుకగా నిలిచాయి. ఐరిస్ ఈవెంట్స్ నిర్వహించిన ఈ కార్యక్రమం అన్ని వర్గాల వారిని ఒకచోట చేర్చి, వినోదం, సృజనాత్మకత, ప్రేరణ నింపింది. వెయ్యిమందికి పైగా మాతృమూర్తులు పాల్గొన్న ఈ పోటీలో 200 మందికి పైగా మహిళలు తమ చిన్నారుల కోసం రూపొందించిన ఆకర్షణీయమైన, వినోదాత్మకమైన కార్యకలాపాలతో పోటీపడ్డారు. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలకు నటీమణులు నీలిమ, ప్రేమి వెంకట్, నటుడు భరత్ కల్యాణ్, జస్ట్ బై సైకిల్స్ ఎండీ రితీష్ తదితరులు అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందించి, సత్కరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 62 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా బాధ్యలు చేపట్టిన అరుణ్ పోలీసు అధికారులు, పోలీసులు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారి సమస్యలు తెలుసుకునేలా ప్రతి మంగళవారం, ప్రజల సమస్యలు తెలుకొనేలా ప్రతి బుధవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం, మంగళవారం నిర్వహించిన శిబిరంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, పోలీసులు హాజరై బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం తగ్గింపు సహా పలు సమస్యలపై 62 వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

వీరపాండి గౌరియమ్మన్ ఆలయంలో ముగిసిన చిత్తిరై ఉత్సవాలు

టి.నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా వీరపాండి గౌరియమ్మన్ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ వేడుకలో ఆలయాన్ని 24 గంటలపాటు భక్తుల దర్శనం కోసం తెరచి ఉంచారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం తేని, దిండుగల్, మదురై జిల్లాల నుండి ప్రత్యేక బస్సులను కూడా నడిపారు. ఈ ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన రథోత్సవం ఈ నెల 9న ప్రారంభమైంది. ప్రతిరోజూ ఒక్కో రథం వీధిలో రథాన్ని ఊరేగించారు. అన్ని వీధులలో ఊరేగిన తర్వాత సోమవారం సాయంత్రం రథమండప ప్రాంతానికి చేరింది. వారం రోజులపాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, అడ్వెంచర్ వెల్ (సాహస బావి), రంగుల రాట్నం, సర్కస్ టెంట్ సందర్శకులను అలరించాయి. ఈ వేడుకలు వినోదాల కోసం సమీప జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయం వద్ద వేల సంఖ్యలో భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టడంతో ఈ ఉత్సవాలు వైభవంగా ముగిశాయి.



దర్శనం కోసం వెళుతున్న భక్తులు

కోలాహలంగా జల్లికట్టు



పెరంబూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా వడచేరిపట్టిలో మంగళవారం నిర్వహించిన జల్లికట్టు కోలాహలంగా సాగింది. పిడారి అమ్మవారి ఆలయ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో పుదుకోట, తంజావూరు, కారైక్కుడి, తిరుచ్చి సహా పలు ప్రాంతాలకు చెందిన 650 ఎద్దులు పాల్గొన్నాయి. అలాగే, 250 మంది యువకులు ఎద్దులు అదుపుచేసేందుకు బరిలో దిగారు. మొదట యువకులు, ఎద్దులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వడివాసల్ నుంచి ముందుగా ఆలయ ఎద్దును వదలగా, ఎవరూ దానిని పట్టుకునేందుకు యత్నించలేదు. అనంతరం రౌండ్ల వారీగా ఎద్దులను వదలగా, వాటిని అదుపుచేసేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ పోటీలో సుమారు 35 మందికి స్వల్పగాయలవగా వారికి ఆ ప్రాంతంలోనే ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో ప్రాథమిక చికిత్స అందించారు. ఎక్కువ ఎద్దులు అదుపుచేసిన యువకులు, యువకులకు అందకుండా పరుగులు తీసిన ఎద్దుల యజమానులకు విలువైన బహుమతులు అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు పుదుకోట సహా పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోటీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా వెల్లనూరు పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.



ఎద్దులను అదుపుచేస్తున్న యువకులు

వైభవంగా పుష్ప పల్లకీల ఉత్సవం

వేలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): చిత్రా పౌర్ణమి సందర్భంగా నగరంలో నిర్వహించిన 8 పుష్ప పల్లకీల ఉత్సవంలో సుమారు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. జలకంఠేశ్వరాలయం, సెల్వవినాయక ఆలయం, ధారాకేశ్వరుడి ఆలయం, విష్ణు దుర్గ ఆలయం, పెరుమాల్ ఆలయం, వేంబులి అమ్మన్ ఆలయం, లక్ష్మీ నరసింహ ఆలయం, కనకదుర్గమ్మ తదితర 8 ఆలయాల నుంచి ఉత్సవమూర్తులు, విద్యుద్దీపాలతో అలంకరించిన పుష్ప పల్లకీల్లో పురవీధుల్లో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఈ ఏడాది వేడుకల్లో పాకిస్తాన్‌పై భారత్ 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడంతో, జెట్ విమానం నమూనాలో రూపొందించిన పుష్ప పల్లకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు లాంగ్ బజార్, కమిషనర్ బజార్, అన్నాసాలై మీదుగా మంగళవారం ఉదయం 9 గంటలకు కోట మైదానానికి చేరుకుంది. ఈ వేడుకల్లో రాష్ట్రంతో పాటు ఆంధ్ర, కర్ణాటక సహా పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.





ఊరేగింపులో పుష్ప పల్లకీలు



అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

సమాజ సేవకులకు
బీఎంఎఫ్ అవార్డులు

ప్యారీస్, మే 13 (ఆంధ్రజ్యోతి): సమాజానికి అంకిత భావంతో సేవలందిస్తున్న వారికి నగరంలోని 'భగవాన్ మహావీర్ ఫౌండేషన్' (బీఎంఎఫ్) అవార్డు ప్రదానం చేసి, ఘనంగా సత్కరించింది. భగవాన్ మహావీర్ బోధించిన అహింసా మార్గంలో పయణిస్తూ విద్య, వైద్యం, సామాజిక సేవల్లో రాణిస్తున్న బీఎంఎఫ్, మహావీర్ జయంతిని పురస్కరించుకుని 2025-2026వ సంవత్సరానికి సంబంధించి ఎంపిక చేసిన అభ్యర్థులకు మైలాపూర్‌లోని మ్యూజిక్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు. అవార్డు ఎంపిక కమిటీ సభ్యులు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు ఎంఎన్ వెంకటాచలయ్య, డాక్టర్ చంద్రచూడ్, ఆచార్య సంతానజీ మహరాజ్, కేంద్ర ఎన్నికల కమిషన్ మాజీ చీఫ్ కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి తదితరులు హాజరై అవార్డు గ్రహీతలను అభినందించారు.

గెరికేర్ హాస్పిటల్స్‌లో
డీఎన్బీ జెరియాట్రిక్స్ కోర్సు

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదంబాక్కం వద్దనున్న గెరికేర్ హాస్పిటల్స్‌లో వృద్ధుల సంరక్షణకు సంబంధించి డీఎన్బీ జెరియాట్రిక్ మెడిసిన్ కోర్సు ప్రారంభించింది. ఈ కోర్సుకు సంబంధించి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్బీఈఎమ్మెస్) గుర్తింపు ఇచ్చినట్లు గెరికేర్ వ్యవస్థాపకులు డాక్టర్ లక్ష్మీపతి రమేష్ తెలిపారు. ఈ మూడేళ్ల కోర్సులో చేరదలచినవారు నీట్ పీజీ 2025లో ఉత్తీర్ణ సాధించాలని, మెరిట్ ప్రకారం నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు కల్పిస్తామని తెలిపారు.



భగవతి అమ్మవారి ఆలయంలో
దీపాల పూజ



దీప పూజలో పాల్గొన్న మహిళలు

ప్యారీస్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కన్నియాకుమారిలో ప్రసిద్ధిగాంచిన భగవతి అమ్మవారి ఆలయంలో 1008 దీపాల పూజ ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయంలో ప్రతిఏటా చిత్తిరై నెల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, రామనాథపురం తదితర జిల్లాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటుంటారు. ఈ ఏడాది కన్నియాకుమారిలోని వివేకానంద కేంద్ర గ్రామాభివృద్ధి పథకం తరుఫున సోమవారం రాత్రి దీప, సుమంగళి పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా సాయంత్రం 4 గంటలకు కన్నియాకుమారి సముద్రతీరంలో సుమారు 1,500 మందికి పైగా మహిళలు, పురుషులు ఊరేగింపుగా బయలుదేరి వివేకానంద పురం జంక్షన్, రైల్వేస్టేషన్ జంక్షన్, పాత బస్టాండ్, రౌండ్ టానాల మీదుగా భగవతి అమ్మ ఆలయానికి చేరుకుని చిత్తిరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కాంచీపురంలో గరుడ సేవ

ప్యారీస్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరంగా ప్రసిద్ధి చెందిన కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన గరుడోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆలయంలో వైకాశి బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మూడో రోజు కార్యక్రమంగా బంగారు గరుడ వాహనంలో వరదరాజ పెరుమాళ్ పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 3 గంటలకు వరదరాజ పెరుమాళ్, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని అలంకరించి, గరుడ వాహనంపై ఆశీనులను చేశారు. భక్తుల గోవిందనామస్మరణ, సన్నాయి మేళం, వేదమంత్రోచ్చారణ నడుమ స్వామివారు నగరంలోని ప్రధాన వీధుల్లో విహరించి, మధ్యాహ్నం 1.30 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. గరుడ సేవ సందర్భంగా రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.



గరుడ సేవలో పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్‌లో స్వామివారికి హారతి) ←

తపాలా కార్యాలయాలకు నూతన సొబగులు



వాషర్‌మెన్‌పేట, మే 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగర పరిధిలోని తపాలా కార్యాలయాలు నూతన హంగులు సంతరించుకోనున్నాయి. ఇందులో భాగంగా కొన్ని కార్యాలయాల కోసం నూతన భవనాలను నిర్మించనున్నారు. ఈ భవనాల్లో వినియోగదారుల కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. సీసీఆర్ అని పిలిచే చెన్నై సిటీ రీజియన్ పరిధి విస్తరించాలని తపాలా శాఖ నిర్ణయించింది. సీసీఆర్ పోస్టల్ పరిధిలో చెన్నై నగరంతో పాటు తిరువణ్ణామలై, రాణీపేట, కాంచీపురం, చెంగల్పట్టు, పుదుచ్చేరి జిల్లాలున్నాయి. రాష్ట్రంలోని 94 కార్యాలయాల్లో 22 కార్యాలయాలు సీసీఆర్ పరిధిలోకి వస్తాయి. ఇందులో పుదుచ్చేరిలోని లాస్‌పేట, విల్లియనూర్ కార్యాలయాలు కూడా ఉన్నాయి. దీని గురించి సీసీఆర్ పోస్ట్‌మాస్టర్ జనరల్ జి.నటరాజన్ మాట్లాడుతూ... ఓల్డ్ కీల్పాక్కంలో ఉన్న పోస్టాఫీసు భవనాన్ని ఇప్పటికే కూల్చి వేశామని, దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించనున్నామని తెలిపారు. అదేవిధంగా మొగప్పేర్‌లోని నక్కీరన్‌వీధిలో ఉన్న పోస్టాఫీసు భవనం సిద్ధమైందని, ఇకనుండి దాని కార్యకలాపాలు అక్కడి నుండే సాగుతాయన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల కొరకు రూ.4.76 కోట్లు కేటాయించామని తెలిపారు. పోస్టాఫీసులను కూడా సుందరీకరిస్తామని, ఇందులో భాగంగా కార్యాలయ సొంత భవనాలు, అద్దె భవనాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామన్నారు. వినియోగదారుల నుండి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సీసీఆర్ పరిధి నెట్‌వర్క్, సేవలను మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కొత్త బ్రాంచీల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కూడా దృష్టిసారించినట్లు వెల్లడించారు. వానగరం, మప్పేడు ప్రాంతాల్లో ఇటీవల జనాభా విపరీతంగా పెరిగిందని, దాంతో అక్కడ కనీసం ఏడు బ్రాంచీల కార్యాలయ భవనాలను తప్పక ఆధునికీకరించాల్సివుందని వివరించారు.



మొదటి ఘాట్‌లో అవ్వాచారి కోన వద్ద ఏర్పాటు చేసిన సోలార్ సీసీ కెమెరా

తిరుమల ఘాట్‌లోనూ
సోలార్ సీసీ కెమెరాలు

తిరుమల, మే13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా ఘాట్ రోడ్లు సహా పలు ప్రాంతాల్లో సోలార్ సీసీ కెమెరాలను అమర్చారు. ప్రస్తుతం తిరుమల శ్రీవారి ఆలయం, వైకుంఠం క్యూకాంప్లెక్సులు, క్యూలైన్లు, అన్నప్రసాద భవనం, లడ్డూ కౌంటర్, కల్యాణకట్టలు, గదుల కేటాయింపు కేంద్రాలు, యాత్రికుల వసతి సముదాయాలు, అలిపిరి, జీఎన్సీ టోల్‌గేట్ వంటి ప్రాంతాలతో పాటు లేపాక్షి, రాంభగీచ, వరాహస్వామి వంటి ప్రాంతాల్లో దాదాపు 2,780 సీసీ కెమెరాలు ఉన్నాయి. పీఏసీ-4లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని వీడియో వాల్ ద్వారా వీటిని పరిశీలిస్తుంటారు. విశేష పర్వదినాల్లో అదనంగా కొన్ని ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సీసీ కెమెరాలను తిరుమల సరిహద్దుల దాకా విస్తరించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా తిరుమల ఘాట్ రోడ్లు, పార్వేటమండపం, శ్రీవారిమెట్టు వంటి సరిహద్దు ప్రాంతాల్లోనూ సోలార్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. తొలివిడతలో 15 సోలార్ కెమెరాలను అమర్చారు. విద్యుత్‌తో అవసరం లేకుండా కేవలం సౌరశక్తితో ఇవి పనిచేయనున్నాయి. వీడియోతో పాటు ఆడియో టెక్నాలజీతో పనిచేసే ఈ సీసీ కెమెరాల ఫుటేజ్‌ను వైర్‌లెస్ కనెక్టివిటీతో ఎక్కడి నుంచైనా స్మార్ట్‌ఫోన్ ద్వారా వీక్షించవచ్చు. వీటి పనితీరు మంచి ఫలితాలు ఇస్తే తిరుమల చుట్టూ మరిన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.


సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,760

తలనీలాలు సమర్పించినవారు: 29,361





గంగమ్మకు నీరాజనం

తిరుపతి గంగ జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి మంగళవారం వేకువజామునుంచే వచ్చారు. పొంగళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. మిగతా గంగమ్మలనూ దర్శించుకున్నారు. ఇలా తరలివచ్చిన భక్తజనంతో గంగమ్మ ఆలయాలు కిటకిటలాడాయి.

పీఎండీఎస్ సాగు పెంచాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎండీఎస్ (తొలకరికి ముందే విత్తడం) సాగును పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎండీఎస్ సాగుపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్షించారు. పీఎండీఎస్ విత్తనాల కిట్‌ను పరిశీలించి సాగు విధానం గురించి తెలుసుకున్నారు. పీఎండీఎస్ విత్తనాల కిట్‌కు 30 రకాల పంట విత్తనాలు కలిపి తయారు చేస్తారన్నారు. ఎకరాకు 10-15 కిలోల విత్తనాలు విత్తుకోవాలన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు 50వేల కిట్లు లక్ష్యంగా చేసుకుని రైతులకు సరఫరా చేయాలన్నారు. వరి నాట్లకు ముందు, మామిడి కోతల తరువాత ప్రతి రైతు తప్పనిసరిగా పీఎండీఎస్ విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పథక మేనేజరు షణ్ముగం పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీస్తారా?

- 'డీడీ నెక్స్ట్ లెవల్' తమిళ సినిమాపై తిరుమల పోలీసులకు ఫిర్యాదు



తిరుమలలో తమిళనాడు మాజీ సీఎం పళని స్వామికి వినతి పత్రం ఇస్తున్న కిరణ్ రాయల్

తిరుమల, మే13(ఆంధ్ర జ్యోతి): 'డీడీ నెక్స్ట్ లెవల్' అనే తమిళ సినిమాలో 'శ్రీనివాస గోవింద' అనే పాట హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందంటూ జనసేన నేత కిరణ్‌రాయల్ తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ పాట వీడియోను కూడా ఫిర్యాదుతో పాటూ ఎస్‌ఐ రమేష్‌కు అందజేశారు. అనంతరం కిరణ్ రాయల్ మీడియాతో మాట్లాడుతూ, 'శ్రీనివాస గోవిందా' అనే పాటను రీమిక్స్ చేసి సినిమాలో క్లబ్ డ్యాన్స్‌గా మార్చారన్నారు. దీనిపై తమిళనాడులోని హిందువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ సెన్సార్ బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. తమకు ప్రభుత్వ సహకారం కూడా ఉందని సినిమా బృందం సభ్యులు చెప్తున్నారన్నారు. తమిళనాడు ప్రభుత్వం నాస్తికుల ప్రభుత్వమన్నారు. దీన్ని హిందూ సమాజంపై కుట్రగానే భావిస్తున్నామన్నారు. ఆ సినిమాను బ్యాన్ చేయకుండా తమిళనాడు నుంచి నాయకులు తిరుమలకు వచ్చి పూజలు చేస్తామంటే ఒప్పుకోమన్నారు. కాగా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన తమిళనాడు రాష్ట్ర ప్రతిపక్ష నేత, మాజీ సీఎం పళనిస్వామిని మంగళవారం కిరణ్‌రాయల్ కలిసి, భక్తుల మనోభావాలు కాపాడేందుకు సహకరించాలని కోరారు.

త్వరలో రుయాలో సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్

తిరుపతి(కలెక్టరేట్), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో త్వరలో సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభిస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్‌పై వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. డయాగ్నొస్టిక్ సెంటర్ అందుబాటులోకి వస్తే 136 రక్త, మూత్ర ఇతర ముఖ్యమైన పరీక్షలు చేసే అవకాశం ఉంటుందన్నారు. తిరుపతి నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నుంచి వచ్చే రోగులకు ఈ కేంద్రంలో పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్

వాడివేడిగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

- కోరం లేకుండానే రెండో కమిటీ సమావేశ నిర్వహణ
- పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులను నిలదీసిన సభ్యులు





సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో రవికుమార్ నాయుడు - హాజరైన సభ్యులు, అధికారులు

చిత్తూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి):చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాడివేడిగా సాగాయి.మొత్తం 7 కమిటీల సమావేశాల్లో రెండో కమిటీ సమావేశాన్ని కోరం లేకుండానే పూర్తిచేశారు.6వ కమిటీ సమావేశానికి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, 5వ కమిటీకి స్త్రీ, శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, తవణంపల్లె జడ్పీటీసీ భారతి, 3వ కమిటీకి వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి అధ్యక్షత వహించాల్సి ఉండగా వారు గైర్హాజరయ్యారు. అన్ని సమావేశాలకూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసులే అధ్యక్షత వహించారు.1వ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులే మిగిలిన కమిటీ సమావేశాల్లో పాల్గొనడం చర్చనీయాంశమైంది.సమస్యలపై చర్చలు తప్ప పరిష్కరించడం లేదని పలు శాఖల అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు మూడు సమావేశాల్లో చర్చించిన సమస్యలను ఇంతవరకూ పరిష్కరించలేదని ఆరోపించారు.

బీసీ హాస్టళ్లలో ఈబీసీలకూ అవకాశం కల్పించండి:జడ్పీ చైర్మన్ సూచన

బీసీ హాస్టళ్లలో మిగిలిన సీట్లను వృధా కాకుండా ఈబీసీలకు అవకాశం కల్పించమని బీసీ సంక్షేమ అధికారులకు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. వి.కోట బీసీ బాలికల హాస్టల్‌లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వేరుశనగ విత్తనాల పంపిణీ ఆలస్యమవుతోందనగా గతేడాది 43 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయగా.. ఈ ఏడాది అందులో సగం మాత్రమే జిల్లాకు కేటాయించారని, ఈ నెలలో పంపిణీ ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దీనిపై జడ్పీ చైర్మన్ ఉన్నతాధికారులతో మాట్లాడి గతం కన్నా ఈ ఏడాది అధికంగా పంపిణీ చేయాలని సూచించారు. ●రామసముద్రం మండలంలో అసంపూర్ణంగా వున్న గ్రామ సచివాలయాల భవనాలను పూర్తి చేయాలని జడ్పీటీసీ రామచంద్రారెడ్డి కోరారు.ఆర్.నడింపల్లె కొండపై 9 నెలల కిందట వాలీశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లేందుకు రూ.2 కోట్లతో రోడ్డు పనులు మొదలుపెట్టి చదును చేసి వదిలిపెట్టారని, వర్షం పడినప్పుడల్లా రోడ్డులోని మట్టి కొట్టుకుపోతోందన్నారు.జడ్పీ గ్రాంట్ కింద సుమారు రూ.45 లక్షలు వాటర్ వర్క్స్ కోసం మంజూరవగా.. రూ.1.20 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ●నారాయణవనం మండలంలోని ఎరుకంబట్టు, గోవిందప్ప నాయుడు కండ్రిగ, సుబ్బానాయుడు కండ్రిగ, తుంబూరు, పాలమంగళం పంచాయతీల్లో రోడ్లపై కంకరవేసి వదిలిపెట్టారని, దీంతో రాత్రివేళల్లో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని జడ్పీటీసీ సుమన్‌కుమార్ చెప్పారు.తారు రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ●వడమాలపేట జడ్పీటీసీ మురళి మాట్లాడుతూ 2015లో రూ.11 లక్షలతో అభివృద్ధి పనులు చేశానని, టెండర్ పిలిచినప్పుడు వ్యాట్, జీఎస్టీ లేదని చెప్పి తీరా బిల్లులు మంజూరు అయ్యాక జీఎస్టీ కట్టమని ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ●పాలసముద్రం జడ్పీటీసీ అన్బలగన్ మాట్లాడుతూ బాలకృష్ణాపురం రోడ్డుపై 2018లో కంకరవేసి వదిలిపెట్టడంతో 5 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ● పెద్దతిప్ప సముద్రం జడ్పీటీసీ శివన్న మాట్లాడుతూ కందుకూరులో తాగునీటి కోసం బోరు వేసి మోటర్ బిగించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ●చౌడేపల్లె జడ్పీటీసీ దామోదరరాజు మాట్లాడు తూ వ్యవసాయ సర్వీసులకు డబ్బులు చెల్లించి రెండేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నారని,ఏఈని అడిగితే మెటీరియల్ లేదని సమాధానం చెబుతున్నారని వాపోయారు ● పెనుమూరు జడ్పీటీసీ దొరస్వామి మాట్లాడుతూ కొటార్లపల్లె ఏఏడబ్ల్యూ జగనన్న కాలనీలో 25మంది ఇళ్లు నిర్మించుకున్నా విద్యుత్ సర్వీసు ఇవ్వలేదని చెప్పగా సమస్యను పరిష్కరిస్తామని ఎస్‌ఈ హామీ ఇచ్చారు. ●ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య మాట్లాడుతూ మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యుత్ శాఖ ఎస్‌ఈ దృష్టికి తీసుకొచ్చారు.సమావేశానికి వైద్య శాఖ అధికారుల గైర్హాజరుపై సభ్యులతో పాటు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి సమావేశానికి చిన్న స్థాయి అధికారులను పంపడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డిప్యూటీ సీఈవో జుబేదా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఆలయం వద్ద ఏఈవో దేవరాజులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్న వీరు.. అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రంతో వేదపండితులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

- రెండు కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు.. శ్రీకాళహస్తి దర్గామిట్టకు చెందిన షేక్ మహబూబ్‌బాషా, కేవీబీపురం మండలం రాగిగుంటకు చెందిన కంచి చైతన్య, తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన ఆదెం వెంకటసాయిప్రతాప్‌రెడ్డి, తిరుపతి రూరల్ తిమ్మినాయుడుపాళెంకు చెందిన మంగళం జోసఫ్ కొంతకాలంగా తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండు, ఇతర రద్దీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయించేవారు. వీరు శ్రీకాకుళం జిల్లాకు చెందిన కింగ్‌పిన్ నుంచి రైళ్ల ద్వారా గంజాయి తెప్పించి చిన్న, చిన్న పొట్లాలు కడతారు. ఒక్కో పొట్లాన్ని రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయించేవారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐలు నాగార్జునరెడ్డి, సిబ్బంది కలసి లీలామహల్- మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయం వద్ద కాపుకాచి నిందితులను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మ స్ఫూర్తితో తిరుగుబాటు చేయాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



తిరుపతి(ఆటోనగర్), మే 13 (ఆంధ్రజ్యోతి): 'నాడు పాలెగాళ్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటమే నేటి గంగ జాతర. గంగమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజలు పాలకులపై తిరుగుబాటు చేయాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మను మంగళవారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'వేలమంది జాతరకు హాజరైన సమయంలో వివిధ వేషాల్లో ఉన్నవారు ఎన్ని బూతులు తిట్టినా ప్రజలు పట్టించుకోరు. అదే ఈ జాతర ప్రత్యేకత' అని పేర్కొన్నారు. 40 ఏళ్ల క్రితం ఒక వ్యక్తి ఆడవేషం వేసుకుని తనను బండిపై ఎక్కించుకొని వెళ్లారంటూ నారాయణ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.మోహన్ కుమార్ రాజు, ఎ.రామానాయుడు, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

అంతా.. ప్రశాంతంగా..!

- పోలీసుల చొరవ భేష్



వీఐపీ దారిలో భక్తులను నియంత్రిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రద్దీని నియంత్రించడంతో ఎక్కడా తొక్కిసలాటలు జరగలేదు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి భక్తుల రద్దీ బాగా పెరిగింది. వేలాది మంది ఒక్కసారిగా రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. వీఐపీ లైను వద్ద మాత్రం చాలా రద్దీ కనపడడంతో డీఎస్పీ భక్తవత్సలం దగ్గరుండి భక్తులను అనుమతించారు. ఒక దశలో భక్తుల రద్దీని నియంత్రించడం పోలీసుల చేయిదాటే పరిస్థితి రావడంతో వెంటనే రోప్ పార్టీని పిలిపించారు. రాత్రి 7 గంటల నుంచి 9.45 గంటల వరకు మహిళలు, యువకులు, వేషాలు ధరించి వస్తున్న భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో వారిని కంట్రోలు చేయడానికి ఇబ్బంది పడ్డారు. ఇక, అన్ని కోణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఎక్కడ ఎలాంటి పరిస్థితి ఎదురైనా కమాండ్ కంట్రోలు యూనిట్ ద్వారా పరిశీలించి చర్యలు చేపట్టారు. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించడంతో దొంగలు, చైన్ స్నాచర్లకు కొంత భయం ఏర్పడింది. బిట్రగుంట గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకోవడంతో చైన్ స్నాచింగ్‌లు కొంత తగ్గుముఖం పట్టాయి. ఇక, జనంలో మిస్ అయిన వారికోసం బాధితులు పోలీసు కంట్రోలు రూముకు సమాచారం ఇస్తుండడంతో వెంటనే వారిని అప్పగించేలా చర్యలు చేపట్టారు. ఇలా రెండు రోజుల వ్యవధిలో దాదాపు 53 మందిని అప్పగించారు.